ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు

మంగళవారం 14 అక్టోబరు 2025



తండ్రీ కొడుకులు

ఒకే పాఠశాలలో టీచర్లు

వాళ్లు తండ్రీ కొడుకులు. స్కూల్ అసిస్టెంట్లు. అందులోనూ ఒకటే స్కూల్. ఈ అరుదైన ఘటనకు వేదికైంది చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఆ తండ్రీ కొడుకులు మునగల రవీంద్రుడు, హరిప్రసాద్. వీరిది తిరుపతి రూరల్ ఓటేరు శ్రీవారినగర్. ఇప్పటికే రవీంద్రుడు తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా ఆ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈయన కుమారుడు ఇటీవల జరిగిన డీఎస్సీ ద్వారా ఫిజికల్ సైన్స్ టీచర్ (స్కూల్ అసిస్టెంట్)గా ఉద్యోగం సాధించారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో హరిప్రసాద్ చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పోస్టింగ్ పొందారు. తండ్రి పనిచేస్తున్న పాఠశాలలోనే సోమవారం విధుల్లో చేరారాయన. 'ఉపాధ్యాయ ఉద్యోగం రావడమే అదృష్టమనుకుంటే.. మా నాన్నతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఇది శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీర్వాదమే. ఉపాధ్యాయుడినై మా నాన్న కలను నెరవేర్చే అవకాశాన్ని మెగా డీఎస్సీ ద్వారా విద్యాశాఖ మంత్రి లోకేశ్ కల్పించారు. మా నాన్న అడుగుజాడల్లో నడిచి.. మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకుంటా. విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తా' అని హరిప్రసాద్ ఆనందంగా చెప్పారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



తిరుమలలో కృతి

నటి కృతిశెట్టి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆమెను చూసేందుకు.. సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కొత్తగా పల్లె పాలన

- క్లస్టర్ వ్యవస్థకు మంగళం
- గ్రేడ్లుగా పంచాయతీల విభజన
- పీడీవోలుగా కార్యదర్శులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త సంస్కరణలతో పల్లె పాలన మారనుంది. గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి తీసుకొస్తున్న నూతన విధానానికి రాష్ట్ర మంత్రివర్గం రెండు రోజుల కిందట ఆమోదం తెలిపింది. ప్రజలకు చేరువగా పాలన ఉండటంతో పాటు కేంద్రప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో క్లస్టర్ల వ్యవస్థకు మంగళం పలికింది. గ్రేడ్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. పట్టణ సమీపంలో ఉండే పంచాయతీలను రూరల్-అర్బన్ (రూర్బన్) పంచాయతీలుగా ప్రత్యేక గ్రేడ్ ఇస్తున్నారు. వీటిలో 10 వేల జనాభా, కోటిపైన ఆదాయం ఉండాలి. ఈ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల స్థానంలో డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీలు)లు నియమితులు కానున్నారు. మున్సిపాలిటీల్లో ఏ విధమైన పాలన ఉంటుందో ఇక్కడా అదే తరహాలో కొనసాగుతుంది. మిగిలిన పంచాయతీలను.. మూడువేలపై జనాభా ఉన్న వాటిని గ్రేడ్-1గా, 3వేలు జనాభాలోపు గ్రేడ్-2గా, 2 వేల లోపు జనాభాఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా విభజించారు. ఇలా గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరోవైపు సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరిస్తున్నారు.



పీడీవోలుగా పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇక పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు(పీడీవో)గా వ్యవహరించనున్నారు. పల్లెల అభివృద్ధిలో వీరి పాత్ర కీలకం చేశారు. ప్రతి పంచాయతీకి పీడీవో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోంటోంది.

జిల్లాలో పంచాయతీలు: 774
అర్బన్-రూరల్ పంచాయతీలు: 15
గ్రేడ్-1: 49
గ్రేడ్ -2: 145
గ్రేడ్ -3: 569
- గ్రామీణ జనాభా: 16.82 లక్షలు
- ఏటా వచ్చే ఇంటి పన్ను: రూ.42కోట్లు

సుస్థిర పాలనకు ఊతం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సంస్కరణలు గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి, సుపరిపాలకు ఎంతగానో దోహదపడతాయి. పట్టణాల తరహాల్లో పల్లెలను అభివృద్ధి చేసేలా కొత్త వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మున్సిపాలిటీ తరహాలోనే నూతన పట్టణ ప్రణాళిక విభాగం ఏర్పాటు చేయడంతో ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంది.

- సుశీలాదేవి,
జిల్లా గ్రామ పంచాయతీ అధికారి

తిరుమలలో నెయ్యి నిల్వల సామర్థ్యం పెంపు

- దాదాపు 2.24 లక్షల కిలోలు నిల్వ చేసేలా ఏర్పాట్లు



నిర్మాణంలో ఉన్న నెయ్యి ట్యాంకర్లు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంతో పాటు ఇతర నైవేద్య అన్నప్రసాదాల్లో వినియోగించే నెయ్యిని అధిక మొత్తంలో నిల్వ చేసేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 2.24 లక్షల కిలోల నెయ్యిని ఒకేసారి నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల నుంచి 4.50 లక్షల వరకు లడ్డూలు, నైవేద్య ప్రసాదాలు వంటి వాటికి 15 వేల నుంచి 17 వేల కేజీల నెయ్యిని వినియోగిస్తోంది. ప్రస్తుతం ఆలయం పక్కనే పుష్కరిణికి అనుకున్న ఉన్న ఘీ స్టోరేజ్ కేంద్రంలో కేవలం నాలుగు ట్యాంకులే ఉన్నాయి. వీటి ద్వారా 80 వేల కేజీలను మాత్రమే నిల్వ చేయగలరు. అంటే నాలుగైదు రోజులకు సరిపడా నెయ్యిని మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఈక్రమంలో నెయ్యి నిల్వలు తగ్గుతున్న సందర్భాల్లో తిరిగి లారీల ద్వారా స్టోర్ చేసుకోవడానికి అధికారులు, సిబ్బంది కంగారుపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి చెక్ పెట్టేదిశగా టీటీడీ నెయ్యి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నూతనంగా నాలుగు నూతన ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ నిల్వ సామర్థ్యం 36 వేల కేజీలు. అంటే 1.44 లక్షల కేజీల అదనపు నెయ్యి నిల్వ సామర్థ్యం టీటీడీకి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న ట్యాంకర్ల నిల్వను కూడా జత చేస్తే దాదాపు 2.24 లక్షల కేజీల నెయ్యిని నిల్వ చేయవచ్చు. వీటి ద్వారా దాదాపు 13 నుంచి 14 రోజులకు సరిపడా నెయ్యిని నిల్వ చేసుకునే వెసులుబాటు టీటీడీకి రానుంది. చెన్నై సూపర్ కింగ్(సీఎస్‌కే) ఈ ట్యాంకర్ల ఏర్పాటుకు విరాళం ఇవ్వడం గమనార్హం.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని నూతన సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. తిరుపతిలోని డిస్కం ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ రంగంలో సంస్కరణలను వేగంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను నెరవేర్చడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉన్న గ్రామాలను త్రీ ఫేజ్‌కు మార్చడం, ఆర్‌డీఎస్ఎస్ స్కీం అమలు చేయడం కీలక బాధ్యతలుగా భావిస్తున్నట్లు తెలిపారు. రెన్యువబుల్ ఎనర్జీ అయిన సూర్యఘర్ వంటి పథకాల అమలును వేగవంతం చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో, సేవల్లో, విద్యుత్ నాణ్యతపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం స్పందించి పరిష్కరించేలా యంత్రాంగం పనితీరును మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. డిస్కంలో ఖాళీ పోస్టుల భర్తీ విషయమై ప్రభుత్వం సమీక్షిస్తోందని, త్వరలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మంచిది. ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లోనూ వీటిని వాడుతున్నారు. ఈ మీటర్ల వల్ల రీడింగ్ కచ్చితంగా తెలుస్తుంది. ఇళ్లయినా, షాపైనా, పరిశ్రమలోనైనా ఎంత లోడ్ ఉందో తెలుస్తుంది. ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సరఫరాను మరింత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఎలాంటి అపోహాలు వద్దు' అని సూచించారు.

సీఎండీగా శివశంకర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: ఏపీ సదరన్ డిస్కం సీఎండీగా ఎల్.శివ శంకర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి ఉదయం 10.30 గంటలకు ఆయన చేరుకోగా.. పూర్వపు సీఎండీ కె.సంతోషరావు స్వాగతం పలికారు. పూజల అనంతరం పూర్వపు సీఎండీ బాధ్యతలు అప్పగించారు. సంస్థ డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, రామమోహన రావుతో పాటు సీజీఎంలు, జీఎంలు, తిరుపతి సర్కిల్ ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు, పలువురు ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాయుడి అంశంపై రగడ

- మళ్లీ తెరపైకి వచ్చిన జనసేన మాజీ ఇన్‌చార్జి వినుత డ్రైవర్ హత్యోదంతం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సరిగ్గా మూడు నెలల కిందట జూలై 12వ తేదీ.. తమిళనాడు సెవెన్‌వెల్స్ ప్రాంతంలో రాయుడు మృతదేహం వెలుగు చూసింది. కూవం నది నుంచి మృతదేహాన్ని వెలికి తీసిన చెన్నై పోలీసులు శ్రీనివాస్ అలియాస్ రాయుడిగా గుర్తించి అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు సహా ముగ్గురు అనుచరులను అరెస్టు చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత అనూహ్యంగా ఆదివారం రాయుడి సెల్ఫీ వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అతడి వ్యాఖ్యలు మళ్లీ సర్వత్రా దుమారం రేపాయి. ఈ వీడియో నేపథ్యంలో వినుతతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం స్పందించారు.

వినుత దంపతులను హతం చేసేందుకు పన్నాగం



'నాపేరు శ్రీనివాసులు అలియాస్ రాయుడు. నేను వినుత దగ్గర డ్రైవర్‌గా పనిచేశా. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేన నేత పేట చంద్రశేఖర్ ద్వారా టీడీపీ కార్యకర్త సుజిత్‌తో పరిచయం ఏర్పడింది. వినుత దంపతుల కదలికలు, వారి విషయాలను ఎప్పటికపుడు చేరవేస్తే రూ.30లక్షలు ఇస్తామని నన్ను ప్రలోభపెట్టారు. ఆ మేరకు రూ.2లక్షలు కూడా వారి నుంచి అందుకున్నా. ఎన్నికల తర్వాత నాకు రూ.20లక్షలు మాత్రమే ఇచ్చారు. మళ్లీ పలుమార్లు పేట చంద్రశేఖర్, సుజిత్ నాతో సంప్రదించి వినుత దంపతులను చంపాలని, మరో రూ.30లక్షలు స్థానిక కూటమిలోని బొజ్జల సుధీర్‌రెడ్డి ద్వారా ఇస్తామని చెప్పారు. నేను కారు నడిపే సమయంలో అతివేగంగా వెళుతూ రోడ్డు ప్రమాదం జరిగేలా రెండుసార్లు ప్రయత్నించే సమయంలో వినుత దంపతులు అప్రమత్తమయ్యారు. అప్పట్నుంచి నన్ను డ్రైవింగ్‌కు దూరంగా పెట్టారు. ఎలాగైనా చంపాలని జనసేన నేత కొట్టే సాయి ద్వారా మళ్లీ నన్ను సంప్రదించారు. తిరుపతిలోని హోటల్‌లో కూటమి ముఖ్యనేత వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. ఆ తర్వాత వ్యక్తిగత వీడియోలు సేకరించి పంపాలని ఒత్తిడి చేశారు. ఒకరోజు నేను వీడియో చిత్రీకరించే సమయంలో నా ఫోన్‌కు మెసేజ్ రావడంతో పట్టుబడ్డా. ఈ విషయాన్ని ఆ ముఖ్యనేత, కొట్టేసాయి, చంద్రశేఖర్, సుజిత్‌కు ఫోను ద్వారా సందేశం పంపా. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మళ్లీ నన్ను నేరుగా కలిసిన చంద్రశేఖర్, సుజిత్ ఎవరి పేర్లు బయట రాకూడదని, అలా వస్తే ఇబ్బందులో పడుతావని హెచ్చరించారు' అంటూ ఆ వీడియోలో రాయుడి మాటలు సాగాయి.

అతడి చావులో మా ప్రమేయం లేదు



'రాయుడి చావులో మా ప్రమేయం లేదు. మేమే హత్య చేశామంటూ ప్రచారం చేయడం.. జైలుకు వెళ్లడంకన్నా బాధ కలిగించింది. మాపై రాజకీయ కుట్ర జరిగింది. అన్ని ఆధారాలతో బాధ్యులైన వారి పాత్రలను బహిర్గతం చేస్తాం. విదేశాల్లో రూ.లక్షల జీతాలు వచ్చే ఉద్యోగాలను వదులుకుని ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాం. అంతేకానీ హత్యలు చేయడానికి కాదు. చావులో మా ప్రమేయం లేదు కాబట్టే నాకు 19 రోజులకు, మిగిలిన నలుగురికి నెల రోజుల వ్యవధిలోనే బెయిల్ మంజూరైంది. కేసు విచారణలో ఉండటంతో న్యాయనిపుణుల సలహామేరకు మేము అంతకుమించి వివరాలను వెల్లడించ లేం. న్యాయస్థానం ద్వారా నిర్దోషిగా బయటపడతాం' అంటూ కోట వినుత సెల్ఫీ వీడియో విడుదల చేశారు.

ఏ విచారణకైనా సిద్ధం



'చనిపోయిన రాయుడు నాపై ఆరోపణలుచేస్తూ వైరల్ అవుతున్న వీడియోపై అధికారులు లోతుగా విచారణ జరపాలి. అది ఏఐ టెక్నాలజీ, మార్ఫింగ్ తరహాలో ఉంది. ఎక్కడి నుంచి ఈ వీడియో విడుదలైంది అనే దానిపై అధికారులు త్వరలోనే నిగ్గు తేలుస్తారు. మార్ఫింగ్ వీడియో అయినా ఉండాలి.. లేకపోతే శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులతో ప్రజల్లో నాకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బురదజల్లేందుకు కుట్ర అయినా చేసుండాలి. ఉద్దేశపూర్వకంగా నాకు సంబంధంలేని విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. చంపే ముందు రాయుడిని బలవంతంగా రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేయించి ఉండాలి. 2019 ఎన్నికల్లో 5వేల ఓట్లు కూడా పొందలేక వినుత డిపాజిట్ కోల్పోయింది. అలాంటి వారితో రాజకీయంగా నాకు పోటీ ఏముంటుంది? హత్య జరిగిన మూడు నెలల తర్వాత ఇపుడు ఎందుకు వీడియోను బయటపెట్టాల్సి వచ్చింది. కావాలనే నాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు' అంటూ ఢిల్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

మత్స్యకారుల బీమా చెల్లింపులకు నిధుల విడుదల

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వే ట్రాక్‌పై ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

● రక్షించిన పోలీసులు



రైల్వే ట్రాక్‌పై దుర్గానాయక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురం సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న ఓ ఆటో డ్రైవర్‌ను చంద్రగిరి పోలీసులు రక్షించారు. పోలీసుల కథనం మేరకు పీలేరుకు చెందిన దుర్గానాయక్ తిరుపతిలో ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. దుర్గానాయక్ కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు డయల్ 100కు, అలిపిరి పోలీసులకు సమాచారం అందించాడు. అలిపిరి పోలీసులు చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం నాయుడు, కానిస్టేబుల్స్ కిరణ్, చిరంజీవి శ్రీవారిమెట్టు మార్గం నుంచి రైల్వే ట్రాక్‌పై గాలిస్తుండగా, దుర్గానాయక్ రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. దీంతో వెంటనే పోలీసులు దుర్గానాయక్‌ను అదుపులోకి తీసుకుని, చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమయస్ఫూర్తితో దుర్గానాయక్‌ను కాపాడిన చంద్రగిరి పోలీసులను పలువురు ప్రశంసించారు.

వెటర్నరీ వర్సిటీలో ఇన్‌చార్జి ఆఫీసర్ల నియామకం



డాక్టర్ ఆర్వీ సురేష్‌కుమార్, డాక్టర్ వి.వైకుంఠరావు, డాక్టర్ కె.ఆదిలక్ష్మమ్మ

తిరుపతి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ రెగ్యులర్ ఆఫీసర్ల పదవీకాలం ముగియనుండడంతో ఇన్‌చార్జి అధికారులుగా సీనియర్ ప్రొఫెసర్లను నియమిస్తూ వీసీ డాక్టర్ జేవీ రమణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెటర్నరీ డీన్‌గా ఆర్వీ సురేష్‌కుమార్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ (డీఎస్‌ఏ)గా వి.వైకుంఠరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(సీవోఈ)గా కె.ఆదిలక్ష్మమ్మను నియమించారు. మూడునెలలపాటు ఈ పదవుల్లో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఈనెల 14న రెగ్యులర్ డీన్ డాక్టర్ కెవీ రబ్రహ్మయ్య, డీఎస్ఏ డాక్టర్ జేవీ రమణ, ఇదే నెల 16న సీవోఈ డాక్టర్ చెంగల్వరాయులు ఆఫీసర్ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో సీనియర్ ప్రొఫెసర్ ప్రాతిపదికన ఇన్‌చార్జి అధికారుల నియామకాలను చేపట్టారు.

ఫార్మాకో విజిలెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం 'ఫార్మాకో విజిలెన్స్ ఇన్ ఇండియా - రోల్ ఇన్ డ్రగ్ సేఫ్టీ అండ్ కెరీర్ అవకాశాలు' అనే అంశంపై ఒక్కరోజు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ ప్రాక్టీస్, నైపర్(గుహవాటి)అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ ఉండేలా, ఘజియాబాద్ ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ సైంటిఫిక్ ఆఫీసర్ తోట ప్రసాద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఫార్మా విజిలెన్స్ భారతదేశంలో ఎంతో వృద్ధి చెందిందన్నారు. ఈ కోర్సుతో విద్యార్థులకు అపార అవకాశాలు ఉంటాయన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ ఇలాంటి జాతీయ వర్క్‌షాప్‌లు విద్యార్థులకు కొత్త పరిజ్ఞానం, పరిశోధనా దృష్టి, వృత్తి దిశతో మార్గదర్శకతను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

స్విమ్స్ ఉద్యోగాల నియామకాల నోటిఫికేషన్‌పై పునఃపరిశీలన చేయండి

● లేఖ ద్వారా టీటీడీ ఈవోకు నవీన్ విజ్ఞప్తి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఉద్యోగాల నియమకాల నోటిఫికేషన్‌పై పునఃపరిశీలన చేయాలని ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్‌ను బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక లేఖ రాశారు. నోటిఫికేషన్‌కు సంబంధించి కొన్ని సమస్యలు, దీర్ఘకాలంగా చాలీచాలనీ జీతాలతో పనిచేస్తున్న వారికి జరుగుతున్న అన్యాయయాన్ని ఈ లేఖ ద్వారా ఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. న్యాయపరమైన ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా నియమకాలు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యాదానం ట్రస్టుకు రూ.10లక్షలు



తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ రూ.10 లక్షల విరాళాన్ని ఇచ్చారు. ఆదివారం రాత్రి విరాళం డీడీని తిరుపతిలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేసి ఎస్వీ విద్యాదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గంగాధరనెల్లూరు మండలంలో కుండపోత

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షం జిల్లాప్రజలను ఇబ్బందులపాల్జేస్తోంది. గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా గంగాధరనెల్లూరు మండలంలోన 108.4 మి.మీ, అత్యల్పంగా గుడుపల్లి, నగరిలలో 1.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా గుడిపాలలో 86.4, చిత్తూరు అర్బన్‌లో 40.2, చిత్తూరు రూరల్‌లో 38.4, పెనుమూరులో 25.8, శ్రీరంగరాజపురంలో 21.8, యాదమరిలో 21.4, తవణంపల్లెలో 18.2, బంగారుపాళ్యంలో 9.2, పులిచెర్లలో 9.0, పూతలపట్టు, రొంపిచెర్ల మండలాల్లో 6.4, సదుంలో 4.6, రామకుప్పంలో 4.0, బైరెడ్డిపల్లిలో 3.2, పలమనేరులో 2.8, వి.కోట, గంగవరం మండలాల్లో 2.4, కుప్పంలో 1.4 మి.మీ నమోదయింది.

పిడుగుపాటుకు విద్యార్థి మృతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ విద్యార్థి మృతిచెందాడు. జంగాలపల్లి గ్రామానికి చెందిన చిట్టిబాబునాయుడు కుమారుడు లతీష్‌కుమార్(20) చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో ఇంటి మిద్దెపైకి వెళ్లిన లతీష్‌కుమార్‌పై పిడుగు పడి ంది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయమైనా లతీష్‌కుమార్ కనపడక పోవడంతో కుటుంబ సభ్యులు మిద్దెపై వెతికారు అక్కడ విగత జీవుడిగా కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తహసీల్దార్ జయప్రకాష్, పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సోమవారం తీర్పు వెల్లడించింది. మదనపల్లెకు చెందిన పుట్టా ప్రసాద్ 2021 మార్చి 3న తన సమీప బంధువైన 13 ఏళ్ళ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. స్కూటర్‌పై బలవంతంగా తీసుకుని మదనపల్లి - పుంగనూరు బైపాస్ రోడ్డులోని ఎగువచెరువుకుంట వద్దగల గుట్ట దగ్గరకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఇంటికి చేరిన బాధిత బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. సోమవారం చిత్తూరులోని పోక్సో కోర్టు కేసు పూర్వాపరాలను విచారించింది. పుట్టా ప్రసాద్‌కు 20ఏళ్ల జైలు, రూ.8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం ప్రభుత్వం తరపున చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వాదించారు.

చంద్రగిరి

టెన్త్ ఫలితాల్లో నూరు శాతం సాధించాలి



కేజీబీవీ పాఠశాలలో పిల్లలతో మాట్లాడుతున్న డీవైఈవో ఇందిరా దేవి

ఎర్రావారిపాలెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో బోధన చేపట్టాలని తిరుపతి డీవైఈవో ఇందిరాదేవి అన్నారు. సోమవారం మండలంలోని నెరబైలు మోడల్ ప్రైమరీ స్కూల్, ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో టెన్త్‌లో నూరు శాతం ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు కరదీపికలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు 1, 2 బాలసుబ్రమణ్యం, సతీష్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ పరిమల, ప్రధానోపాధ్యాయులు రెడ్డిచెర్ల సుబ్రమణ్యం, ముక్కు చంద్రశేఖర్, శ్రీహరి, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్మార్ట్ రేషన్‌కార్డులు తీసుకోండి

తిరుపతిరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల పరిధిలో 4882 స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత రేషన్‌షాపు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ రామాంజులు నాయక్ పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈనెల 25లోపు కార్డులు పొందాలని ఆయన కోరారు.

19న ఐతేపల్లెలో నీ గానమే.. నా ప్రాణం

చంద్రగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఐతేపల్లెలోని జీఆర్‌కే కల్యాణ మండపంలో ఈనెల 19వ తేదీన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో నీ గానమే, నా ప్రాణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటలకు కాషాయ ధ్వజారోహణం, 5.20 గంటలకు గోపూజ, 5.40 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలన, 6 గంటలకు నీ గానమే, నా ప్రాణం అఖండ భజన ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు అఖండ భజన కార్యక్రమం ముగింపు, 6.30 గంటలకు ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు పడిపూజ, 8 గంటలకు శాంతి వచనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అఖండ భజనకు అయ్యప్ప భక్తులు, భజన బృందాలు, గాయకులు విచ్చేసి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సింగిల్‌విండో ద్వారా రైతులకు విరివిగా రుణాలు



రైతులకు రుణాలు అందజేస్తున్న సింగిల్‌విండో చైర్‌పర్సన్ సావిత్రి

పాకాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాకాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్‌విండో) ద్వారా రైతులకు విరివిగా రుణాలు అందజేస్తున్నట్లు చైర్‌పర్సన్ కె.సావిత్రి తెలిపారు. డీసీసీ బ్యాంక్ ద్వారా సంఘంలోని రైతులకు స్వల్పకాల, దీర్ఘకాలిక రుణాలు, గ్రామీణ ఇండ్ల తనఖా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. సోమవారం రైతులకు రూ.4,90,000లు రుణాలు పంపిణీ చేశారు. రైతులు తగిన దస్తావేజులు సమర్పించి రుణాలు పొందాలని కోరారు. పంట, ఇతర రుణాలు తీసుకున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు ఆనంద్, కిరణ్ కుమార్, డీసీసీబీ మేనేజర్ బి.చక్రవర్తి, సూపర్‌వైజర్ ఇ.దొరస్వామి, సింగిల్‌విండో సీఈవో బి.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం



మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిర్మించిన కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్‌ఎంఆర్ కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వినతిపత్రాన్ని అందజేశారు.

కోదండరాముడికి వైభవంగా పవిత్రాల సమర్పణ



పవిత్రమాలలను తీసుకెళుతున్న అర్చకులు, అధికారులు

చంద్రగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం పవిత్రమాలల సమర్పణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ ద్వార పూజ, కుంభారాధన, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. 9 గంటల నుంచి యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు, 12 మంది ఆళ్వార్లు, భక్త ఆంజనేయ స్వామి, విష్వక్సేనుడు, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హోమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి, విమానగోపురానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటల నుంచి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ ఎంపీడీవో నియామకం ఎప్పుడో..!

తిరుపతిరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో బదిలీ జరిగి నెలరోజులకు పైబడినా రెగ్యులర్ అధికారి నియమించలేదు. ఇంతకుముందు ఎంపీడీవోగా పనిచేసిన రామచంద్ర గత నెల 6న బదిలీపై వెళ్లారు. అదే నెల 9న డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈయన అదనంగా తనపల్లె, గాంధీపురం గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. నెలరోజులకు పైగా రెగ్యులర్ అధికారి నియామకం లేక ఇన్‌చార్జితోనే మండల పాలన నడుస్తోంది. మండల పరిధిలో పాలనాపరమైన విధులతోపాటు ఇతర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణలో ఎంపీడీవో భాగస్వామ్యం కీలకంగా ఉంటుంది. 34 పంచాయతీలతో ఏర్పడిన తిరుపతి రూరల్‌కు జిల్లాలో పెద్ద మండలంగా పేరుంది. దీనికి తోడు జిల్లా కేంద్రానికి కూతవేటుదూరంలో ఉండడంతో ప్రోటోకాల్ తాకిడి కూడా అధికంగానే ఉంటుంది. ఈనేపథ్యంలో విధుల నిర్వహణలో ఇన్‌చార్జి అధికారి పరిస్థితి ఇక్కడో అడుగు.. అక్కడో అడుగు అన్నచందాన ఉందన్న చర్చ నడుస్తోంది. పంచాయతీల్లో సమస్యలతోపాటు అత్యవసర సర్టిఫికెట్ల కోసం ఇబ్బందిపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. డెత్‌సర్టిఫికెట్స్, భవన నిర్మాణ అనుమతులు వంటి పనుల కోసం దరఖాస్తు చేసినా సకాలంలో సేవలు అందడంలేదన్న విమర్శలు ఉన్నాయి. రోజులతరబడి పంచాయతీకార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. సిబ్బందిని అడిగితే కార్యదర్శి అందుబాటులో లేరంటూ నిర్లక్ష్యపు సమాధానమిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో స్థానిక సమస్యల పరిష్కారానికి సర్పంచులు చొరవ చూపడం లేదన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. పలు పంచాయతీల్లో ఇప్పటికీ ఇన్‌చార్జి కార్యదర్శులే ఉండడం వల్ల పాలన గాడి తప్పుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాలకులు స్పందించి త్వరగా రెగ్యులర్ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల నియామకాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రంప్ పిచ్చివాగుడుకు ఎవరూ భయపడరు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుచానూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ట్రంప్ ఊకదంపుడు ప్రసంగాలు, పిచ్చివాగుడుకు ఎవరూ భయపడరని, ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశం ఆర్థికంగా, శక్తివంతంగా ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. తిరుచానూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఖాదీ సంత ఖాదీ సంత కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరై ప్రజలందరూ స్వదేశీ వస్తువుల వినియోగానికి మద్దతు ఇవ్వాలని కోరారన్నారు. ఆత్మనిర్భర్ కార్యక్రమం డిసెంబరు 25వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ను ఊహించని విధంగా దెబ్బతీసినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రాజు మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత అభియాన్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రఅధికార ప్రతినిధి జల్లి మధసూదన్, టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు గోపి శ్రీనివాస్, బీడీ బాలాజీ, మునికృష్ణయ్య, నరేష్, నాదముని, సుచిరిత తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై గజరాజుల దాడి



ఏనుగులు తొక్కి వేసిన వరి పైరు, విరిచేసిన టెంకాయ చెట్లు

భాకరాపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై గజరాజుల దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని చిట్టేచెర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి భాస్కరరెడ్డి, విశ్వనాథరెడ్డికి చెందిన వరి పంటను ధ్వంసం చేశాయి. అలాగే చంద్రారెడ్డికి చెందిన టెంకాయ చెట్లను విరిచేశాయి. వెన్ను దశలో ఉన్న వరి పంటను ఏనుగులు తొక్కి వేయడంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సరిహద్దుల్లో ఏనుగులు ఎప్పుడు, ఎవరి పొలాలపై దాడులు చేస్తాయోనని రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తలకోన అడవుల్లోకి వెళ్లేలా అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తగ్గని నీవా ఉధృతి





కాలనీలో నీవానది నీళ్లు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలతో పాటు చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నీవానది పొంగిపొర్లుతోంది. రెండు రోజులుగా నీవానది ఉధృతంగా ప్రవహించడంతో స్థానికంగా కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తేనబండ, వీరభద్రకాలనీ, రిక్షాకాలనీ, కైలాసపురం, రాజుగుడివీధి తదితర కాలనీలు వరదనీటితో మునిగిపోయాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు రెస్క్యూ టీములతో సహాయక చర్యలు చేపడతున్నారు. సోమవారం చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ విజయానందరెడ్డి, ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు గురైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బాధితులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. 40,41వ డివిజన్ల నేతలు పీఎస్ చందు, భువనేశ్వరిల ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. మాజీ నీకేబాబు తనయుడు సాయికృష్ణారెడ్డి, ఇతర పార్టీ నేతలు ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించి అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

ధర్నాకు వెళుతూ మృత్యుఒడిలోకి..

మినీ బస్సు బోల్తా పడి ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి ● ఆరుగురికి తీవ్రగాయాలు



బోల్తాపడిన వాహనం





మృతుడు చరణ్‌కుమార్ (ఫైల్ ఫొటో) - క్షతగాత్రులు

పలమనేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో తలపెట్టిన విద్యుత్‌శాఖ ఉద్యోగుల ధర్నాకు పలమనేరు ప్రాంతం నుంచి మినీబస్సులో వెళ్తుండగా సోమవారం వేకువజామున ప్రకాశం జిల్లా టంగుటూరి మండలం వద్ద వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగవరం మండలం పత్తికొండ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ గ్రేడ్-2 సి.చరణ్‌కుమార్ మృతిచెందగా.. మరో ఆరుగురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే 13 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొని కాలువలో బోల్తా పడింది. గంగవరం మండలం పత్తికొండ గ్రామానికి చెందిన సి.చరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా..లైన్ ఇన్‌స్పెక్టర్ సుహేల్,లైన్‌మన్ రామ్మోహన్, శ్రీనివాస నాయక్,ప్రసాద్‌బాబు,జూనియర్ లైన్‌మన్ గ్రేడ్-2 బాలసుబ్రహ్మణ్యం, రాజేష్, దినేష్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహకారంతో బస్సు నుంచి గాయపడ్డ వారిని బయటకు తీశారు. 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం రామ్మోహన్, బాలసుబ్రహ్మణ్యం, రాజేష్‌లను తిరుపతికి తరలించగా.. శ్రీనివాస నాయక్, ప్రసాద్ బాబులను వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పలమనేరు ఏడీఈ జీవన్‌కుమార్ ఒంగోలుకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించడంతో పాటు వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ మెరుగైన చికిత్స కోసం వారు కోరిన ఆస్పత్రులకు పంపి చికిత్సలు అందిస్తున్నారు.

తగ్గిన జీఎస్టీపై బైక్ ర్యాలీ



తిరుపతి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య కోరారు. సూపర్ జీఎస్టీ వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి టౌన్ క్లబ్ కూడలి వరకు నగరపాలక సంస్థ, జీఎస్టీ సిబ్బంది స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



మీడియాతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదోన్నతులు కల్పించాలని నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె.విశ్వేశ్వరరెడ్డి కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అయన మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో ఆరు నెలలుగా కాలయాపన చేస్తున్నారనే కానీ ఎటువంటి చర్యలూ కనిపించడం లేదన్నారు. ఈ విషయమై కడపలోని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ రీజనల్ డైరెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విజయవాడలో జరిగిన నాన్ టీచింగ్ స్టాఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక చెల్లదన్నారు.

బాణసంచా దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని తిరుపతి నగరంలో ఏర్పాటు చేసే బాణసంచా విక్రయకేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని డీఆర్వో నరసింహులు సూచించారు. ఈ మేరకు అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. దుకాణాల మధ్య కనీసం మూడుమీటర్ల దూరం ఉండాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిధర్‌కు సన్మానం



గిరిధర్‌ను సన్మానిస్తున్న రంగస్థలి సభ్యులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో అయన్ను ఘనంగా సన్మానించారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సురేష్ స్వామి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి సభ్యులు మహీధర్‌రెడ్డి, అనిల్, రాజశేఖర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



సీపీఆర్‌పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వేదికగా సోమవారం వివిధ శాఖలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఐవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీల బ్రోచర్‌ను, ఈనెల 18వ తేదీ వరకు అంతర్జాతీయ బాలికల దినోత్సవానికి సంబంధించి బాలికల సంరక్షణపై ముద్రించిన పోస్టర్లను, స్త్రీనిధి రుణ వాయిదాలపై డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి బాబూ..!



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం మ్యాంగో మార్కెట్ యార్డు సమీపంలోని గరుడ వారధి వద్ద సోమవారం ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు ఒక పువ్వు అందించి, హెల్మెట్ ధరించాలని సూచించారు. గరుడ వారధిపై గరిష్ఠ వేగ పరిమితి 30 కిలోమీటర్ల స్పీడేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు సంజీవ్‌కుమార్, సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు బాలాజీ, విజయలక్ష్మి, ట్రాఫిక్ సిబ్బంది, నారాయణ స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.5లక్షల టపాసుల సీజ్



నిల్వ ఉంచిన బాణసంచాను పరిశీలిస్తున్న సీఐ సునీల్‌కుమార్

తిరుచానూరు. అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువైన బాణసంచాను సీజ్ చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి తమిళనాడు నుంచి టపాసులు తెప్పించి నిల్వ ఉంచాడని, స్థానికుల సమాచారం మేరకు సీజ్ చేసి, దామోదర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని రాష్ట్రీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో సోమవారం రాస్ డైరెక్టర్ బాలాజీ చౌదరి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. వారితో కలసి భోజనం చేశారు.

తాగునీటిలో మురుగునీరు కలుస్తోంది

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 46 వినతులు



ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి) : తాగునీటిలో మురుగునీరు కలుస్తోందని నగరంలోని పలు డివిజన్ల నుంచి కమిషనర్ మౌర్యకు ఫిర్యాదులు వచ్చాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయి. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ దూది కుమారి తమ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. లక్ష్మీపురం కూడలి పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎస్.కె.బాబు ఫోన్ ద్వారా కోరారు. యాదవ వీధిలో తాగునీటిలో మురుగు నీరు కలుస్తున్నాయని, పరిష్కరించాలని, పింఛన్ ఇప్పించాలని, కొర్లగుంట రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని, యాదవ వీధిలో రోడ్డు నిర్మించాలని, కూరపాటి లే అవుట్ వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతులు వచ్చాయి. ఏఆర్ హాస్పిటల్ రోడ్డులో అనధికారిక నిర్మాణాలు అడ్డుకోవాలని, కుక్కల సమస్య పరిష్కరించాలని, ఎల్ఎస్ నగర్‌లో కాలువలు మరమ్మతు చేయాలని, నగరంలోని ఓపెన్ డ్రైన్స్‌లో చెత్త వేయకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతుమాదవ్, రవి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దు

● సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి
● కమిషనర్ మౌర్య

తిరుపతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారమూ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారంపై సోమవారం సాయంత్రం అధికారులు, ఆన్లైన్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. విభాగాల వారీగా పరిష్కారం కానివి ఎన్ని, ఎందుకు పరిష్కారం కాలేదు తదితర విషయాలపై చర్చించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాకపోతే కారణాలు తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ మాజీ వీసీ అప్పారావుకు సన్మానం



అప్పారావును సన్మానిస్తున్న వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మాజీ వీసీ అప్పారావును ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం సన్మానించారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీకి అప్పారావు అందించిన సేవలను కొనియాడారు. విధానపరమైన నిర్ణయాలపై లోతుగా చర్చించి నిర్ణయం తీసుకునే వారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయన అనుభవాన్ని, ఆలోచనలను ఉపయోగించుకో నున్నట్టు చెప్పారు. అప్పారావు మాట్లాడుతూ తాను చదువుకున్న యూనివర్సిటీకి నిజాయితీగా సేవచేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. తన పాలనా కాలంలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ నుంచి ఏ సహకారం కోరినా అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ చెంద్రాయుడు, పరీక్షల డీన్ సురేంద్రబాబు, రీసెర్చ్ డీన్ నరసింహ, డెవలప్‌మెంట్ డీన్ బాలాజీ, ఇంటర్నేషనల్ డీన్ కిషోర్, డీడీఈ డైరెక్టర్ రమేష్‌బాబు, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, ప్రిన్సిపాళ్లు సుధారాణి, పద్మావతి, శ్రీనివాసులు, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ గుర్రంకొండ, కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కురబ, కురవ సంఘం ఎన్నికల కమిటీ నియామకం



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : కురబ, కురమ, కురవ సంఘం నూతన కార్యవర్గ నియమకానికి ఎన్నికల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పదవులను నామినేట్ చేస్తూ వచ్చామని, ఈసారి ప్రజాస్వామ్య పద్ధతిలో నియమించేందుకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. గ్రామ, మండల, పట్టణ, జిల్లా, రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నిర్వహణకు కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. కమిటీ ఛైర్మన్‌గా తట్టె అర్జునరావు, కన్వీనర్‌గా జబ్బల శ్రీనివాస్, కోకన్వీనర్లుగా లింగమూర్తి, రవిశంకర్, రెడ్డికుమార్, కురవ రామకృష్ణ, అశోక్, సూర్యనారాయణరెడ్డి, దుర్గారావు, వెంకటేశ్వర్లు, బీరయ్య, పరమేశ్ వ్యవహరిస్తారని చెప్పారు.

ఔషధ మొక్కల పెంపకంతో జీవనోపాధి

● ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు సీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆవుల చంద్రశేఖర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల పెంపకంతో జీవనోపాధి కలుగుతుందని ఏపీ ఔషధ మొక్కల, సుగంధ ద్రవ్యాల బోర్డు సీఈవో ఆవుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఔషధ మొక్కలు చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నాయన్నారు. ఔషధ మొక్కల సాగును ఉపాధిగా మార్చుకోవచ్చన్నారు. ప్రతి ఔషధ మొక్కలోనూ గొప్ప ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు మాట్లాడుతూ కాలేజీ ప్రాంగణంలో హెర్బల్ గార్డెన్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.6.25 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసేందుకు మార్గం సుగమం కావడం పట్ల వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోటనీ హెడ్ సురేష్, అధ్యాపకులు సుధాకర్, నాగరాజు, సుజాత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుతల కోసం నాలుగు బోన్ల ఏర్పాటు



మంగళం/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా విద్యార్థులను హడలెత్తిస్తున్న చిరుతను బంధించేందుకు ఎస్వీ యూనివర్సిటీ, వేదిక్ యూనివర్సిటీ, హాస్టళ్ల వద్ద సోమవారం 4 బోన్లను ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రాత్రిపూట పదిమంది సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. చిరుతలు సంచరిస్తున్న ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 వరకు ఒంటరిగా తిరగకూడదని సూచించారు. కుక్కల కోసం చిరుతలు వస్తున్నాయని, హాస్టల్ విద్యార్థులు ఆహార పదార్థాలను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని చెప్పారు.

రాత్రిపూట జన సంచారం నిషేధం

ఎస్వీ వేద వర్సిటీలో చిరుత సంచారం నేపథ్యంలో రాత్రిళ్లు జన సంచారాన్ని నిషేధిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సాయంత్రం 6 తర్వాత విద్యార్థులు, ఉద్యోగులతో సహా జన సంచారాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు అధికారులు సోమవారం ప్రకటించారు.





ఎస్పీడీసీఎల్ కొత్త సీఎండీ శివశంకర్‌కు స్వాగతం, మాజీ సీఎండీ సంతోషరావుకు వీడ్కోలు పలుకుతున్న ఇంజనీరింగ్ అసోసియేషన్ నేతలు పుల్లా బాలాజీ, వి.రమేష్‌బాబు, డి.నాగరాజు, సి.గంగాధర్‌రెడ్డి, కె.జయప్రకాష్, పి.భాస్కర్‌నాయుడు, కె.మునిప్రసాద్, సి.బాలాజీ, జి.రమేష్, కె.స్వాతి, కె.వెంకటలక్ష్మి తదితరులు

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 175 ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 175 ఫిర్యాదులు అందాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారులతో ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో వ్యవహరించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత, సీఐలు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి రూ.లక్ష సాయం



తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన టీఎల్ వెంకటరత్నం కుటుంబానికి సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు రూ.లక్ష చెక్కు అందజేశారు. తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ, గతనెల 12న ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణి టి.ఉషాదేవికి ఐఆర్ ఫండ్ ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



లక్ష్మీప్రణతి, నార్నె నితిన్ దంపతులు- ఏక్తా కపూర్ - వెంకీ కుడుముల

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హీరోయిన్ కృతిశెట్టి, దర్శకుడు వెంకీ కుడుముల, జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీప్రణతి, ఆమె సోదరుడు, హీరో నార్నె నితిన్ దంపతులు, బాలీవుడ్ సినీనిర్మాత ఏక్తాకపూర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కొత్త టీచర్లొచ్చారు

నూతన ఉపాధ్యాయుల రాకతో జిల్లాలోని పాఠశాలలు సోమవారం కళకళలాడాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎంపికైన వారిలో 1,394 మంది ఉపాధ్యాయులు పోస్టింగ్ పొందారు. వీరంతా కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధులకు హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. మొదటిరోజు కావడంతో సీనియర్లు నూతన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని విధుల గురించి సూచనలు చేశారు.



తిరుపతిలోని ఎంజీఎం పాఠశాలలో చేరేందుకు..

పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను విశదీకరించారు.

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది.
సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,424

తలనీలాలు సమర్పించినవారు: 36,711



మా మొర ఆలకించండి మహాప్రభో..!

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 290 వినతులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు 162 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ సుధారాణి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు

మా భూమిని కబ్జా చేశారు..



నేను గూడూరులో చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తడ మండలం తడ కండ్రిగ గ్రామంలో ప్రభుత్వం 31 సెంట్ల మెట్టభూమి ఇచ్చింది. దీన్ని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. సర్వేకు పలు దఫాలు చలానా కట్టినా హద్దులు కూడా చూపించడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాను. మీరైనా న్యాయం చేయండి.

- చంద్రయ్య, తడకండ్రిగ, తడ మండలం



మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిలా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ 138జీవో ప్రకారం పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పోను రూ.16వేలు, సూపర్‌వైజర్లకు రూ.18,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా అరకొరగా ఇస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. వారికి డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్‌కుమార్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు నరసింహులు, కిషోర్, వరలక్ష్మి, పద్మ, నాగభూషణం, సుశీల, సులోచన, వనజ, సునీల్, పార్వతి పాల్గొన్నారు.

మా పొలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి



తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురం గ్రామ పరిధిలో 40ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. రెవెన్యూ అధికారులు మా పాసుపుస్తకాన్ని మరొకరికి ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మా భూమిలోకి ప్రవేశించి హద్దులు చెరిపేశారు. మేము పొలం వద్దకు వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కోర్టుకు కూడా వెళ్లాం. కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాం. లాభం లేకపోయింది. స్థానిక రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు. కబ్జాదారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి. లేకపోతే చావు ఒక్కటే మాకు మార్గం.

- వీరాస్వామి, అమరావతి దంపతులు, శ్రీకృష్ణాపురం, తొట్టంబేడు మండలం

పెండింగ్ వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయండి

శెట్టిపల్లెలో పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2018లో అప్పటి కలెక్టర్ చెప్పిన విధంగా శెట్టిపల్లె గ్రామం ఉత్తరం వైపు, చెరువుకు తూర్పు వైపున సప్లై చానల్‌కు దక్షిణం వైపున ప్లాట్స్ అలాట్‌మెంట్ చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా అలాట్‌మెంట్ చేసే ప్లాట్లను మినిమం సైజు ద్వారా ఇవ్వాలన్నారు. శెట్టిపల్లె గ్రామంలో తుడా మాస్టర్‌ప్లాన్ రోడ్డును కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బత్తినిబాబు, జయరామయ్య, చెంగయ్య పాల్గొన్నారు.



కొడుకే మోసం చేశాడు

'అయ్యా నాకు ముగ్గురు కుమారులు. నా భర్త ఎలక్ట్రిసిటీ బోర్డులో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన మరణానంతరం రెండో కుమారుడు చంద్రశేఖర్, అతడి భార్య వచ్చి రంగంపేట వద్ద ఉండే 93 సెంట్ల వ్యవసాయ భూమికి సంబంధించి మోసపూరితంగా నా వేలిముద్రలు వేయించుకున్నారు. నగలూ తీసుకున్నారు. ఇప్పుడు ఆరోగ్యం బాగోలేకపోతే పట్టించుకోవడం లేదు. మోసపూరితంగా రాయించుకున్న పత్రాలను రద్దు చేసి, నాకు సాయం చేయండి' అంటూ పూతలపట్టుకు చెందిన శకుంతలమ్మ ఆవేదన చెందారు.

సీజేపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవదాసు, వాసుదేవరావు, మధు, గోపి, అరుణ, రవి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.

దివ్యాంగుల పింఛను ఇప్పించండి



మేము ముగ్గురం ఆడపిల్లలం. తండ్రి మరణించాడు. 90శాతం వికలాంగత్వం ఉంది. ఏ పనీ చేయలేను. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

- సత్యవతి, ఎల్లమండ్యం, రేణిగుంట మండలం

ఒక్క నిర్ణయం.. ఎందరికో జీవితం

- నూతన ఉపాధ్యాయుల్లో వెల్లివిరిసిన ఆనందం

తిరుపతి(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఈడీ చేశారు. డీఎస్సీ కోసం ఆరేళ్లకుపైగా ఎదురు చూశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించాలన్న నిర్ణయం.. ఉమ్మడి జిల్లాలోని 1403 మంది జీవితాల్లో వెలుగు నింపింది. వీరిలో 1394 మంది పోస్టింగ్ ఆర్డర్లు పొందారు. సోమవారం బడుల్లో చేరారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

నా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం



మాది పేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలో రెండో అమ్మాయిని. నా తల్లిదండ్రులు పద్మమ్మ, గున్నయ్య కూలి పనులుచేస్తూ చదివించారు. పేదరికం నుంచి బయటపడేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా అవకాశాన్ని వదులుకోకూడదని కష్టపడ్డా. డీఎస్సీలో 76.57 మార్కులు సాధించి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. చిత్తూరు జిల్లా వి.కోట మండలం కుదువగడ్డ ప్రాథమిక పాఠశాలలో చేరా. ప్రభుత్వం కల్పించిన అవకాశం.. మా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం ఈ ఉద్యోగం.

- టి.భవాని, కమ్మకొత్తూరు, శ్రీకాళహస్తి మండలం

తల్లిదండ్రులకే అంకితం



మా తల్లిదండ్రులు జానకమ్మ, రాధాకృష్ణ వ్యవసాయంతో జీవనం సాగించేవారు. నన్ను ఎంతో ప్రోత్సహించారు. మెగా డీఎస్సీలో అర్హత పొందిన నేను ఎస్టీటీలో జిల్లాలో 24వ ర్యాంకు, ఎస్ఏ సోషల్ 67వ ర్యాంకు, టీజీటీ సోషల్ 77వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 31వ ర్యాంకు సాధించా. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా చేరా. ఎన్ని ఇబ్బందులున్నా నాకు ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఈ ఉద్యోగాన్ని అంకితం చేస్తున్నా.

- నల్లపాటి శివకుమార్, గోవిందప్పనాయుడు కండ్రిగ, బీఎన్‌కండ్రిగ మండలం

అత్యంత ఆనందం



మాది పేద దళిత కుటుంబం. బీకామ్, బీఈడీ చేశా. నా తల్లిదండ్రులు బొగ్గల ఆదెయ్య, వేమక్కకు పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్నా. మెగా డీఎస్సీ ప్రకటనతో కోచింగ్ లేకుండానే కష్టపడి సన్నద్ధమయ్యా. రాయలసీమ జోన్ పరిధిలో 67.1028 మార్కులతో టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. రేణిగుంట మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విధుల్లో చేరా. అన్ని వృత్తుల్లోకి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి లభించడం నా ఆనందం.

- ప్రతాప్, ఎన్టీఆర్ నగర్, బుచ్చినాయుడు కండ్రిగ మండలం

మెగా డీఎస్సీ జీవితాన్నిచ్చింది



మాది నిరుపేద దళిత కుటుంబం. మెగా డీఎస్సీలో 75.46 మార్కులతో సాధించి సెకండరీగ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యా. శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. చిన్న వయసులోనే తండ్రి వీరయ్యను కోల్పోయా. కష్టపడి నన్ను చదివించిన తల్లి మెరుంవాణి కూడా ఏడాది కిందట చనిపోయింది. మెగా డీఎస్సీ నాకు జీవితాన్నిచ్చింది.

- లావణ్య, చిన్నసింగమాల, తొట్టంబేడు మండలం

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మా నాన్న ఫిజికల్ డైరెక్టర్ మస్తానయ్య. తల్లి కళావతి. గత డీఎస్సీలో ఉద్యోగం సాధించలేకపోయాను. మెగా డీఎస్సీ ప్రకటించగానే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివా. మెగా డీఎస్సీలో 83.03 మార్కులు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం సాధించా. బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. మా నాన్నను ప్రేరణగా తీసుకుని ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి నా ఆనందానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- పవన్‌కుమార్, కాంపాళెం, బీఎన్ కండ్రిగ మండలం

అంతరిక్ష ప్రయోగాలతో మానవాళి శ్రేయస్సు

- షార్ డైరెక్టర్ పద్మకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సోమవారం సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 63 ఏళ్లలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఇతరదేశాలకు సైతం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్య సంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ విభాగాల్లో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రోఆధ్వర్యంలో 'యువికా'లాంటి కార్యక్రమాలతో పాటు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టుల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ ప్రిన్సిపాల్, కమాండెంట్ రాజేష్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, కంట్రోలర్ జి.రమేష్ బాబు, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, వాల్ఫ్ డీడీ శంకరన్, రమణారెడ్డి, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

- మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడి మృతి



రామచంద్రాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రామాపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచి సురేంద్ర నాయుడు(60) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామచంద్రాపురం మండలం కొత్తకండ్రిగకు చెందిన లెక్కల సురేంద్ర నాయుడు తన పొలంలో కూరగాయలను తిరుపతి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. సోమవారం ఉదయం 5గంటలకు తిరుపతిలో విక్రయించి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో రామాపురం సమీపంలోని విల్లాస్ వద్ద వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందారు. ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర సాధనతో లక్ష్యాల ఛేదన

- 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్



విద్యార్థులకు కళాచిత్ర పురస్కారం అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రామిశెట్టి మౌనిక, జి.కీర్తి, వేలూరు చేతనకు కలెక్టర్‌తో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి కలిసి కళాచిత్ర ట్రస్టు అందించే పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పేదరికాన్ని జయించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కళాచిత్ర కుటుంబ సభ్యులు తాము చదివిన పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది నుంచి కళాచిత్రతో పాటు శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

మూడో కన్ను పుస్తకావిష్కరణ: రచయిత, ఆంధ్రజ్యోతి పూర్వ విలేకరి ఆర్ఎంవీ భాస్కర్‌బాబు రచించిన మూడో కన్ను పుస్తకాన్ని కలెక్టర్, శ్రీసిటీ ఎండీ ఆవిష్కరించారు. ఆరుపదుల వయస్సులో ఇలాంటి మంచి పుస్తకాన్ని రచించారంటూ రచయితను అభినందించారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో సునీల తదితరులు పాల్గొన్నారు.



గిరీష్మసైనిరెడ్డి | విష్ణుప్రియ | పర్ణితయాదవ్ | కె.శుభశ్రీ | రుక్సార్‌తబ్బుమ్

ఆంధ్రా ఉమెన్ టి20 క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి ఐదుగురు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టీ20క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవలె నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మసైనిరెడ్డి(వైస్‌కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్బుమ్ సత్తాచాటారు. దీంతో వీరి ఎంపికపై సెలెక్టర్లు మొగ్గుచూపారు. ఈ ఐదుగురిలో ఒకరికి వైస్‌కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ నెల 20నుంచి 23వరకు తెలంగాణలోని ఔరంగాబాదు జరగనున్న అండర్ 19ఉమెన్స్ టీ20చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పల్లికొండేశ్వర ఆలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి విచారణ

నాగలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సోమవారం మధ్యాహ్నం నూతన పాలక మండలికి సంబంధించి విచారణ చేపట్టారు. గత శుక్రవారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగిన విషయం తెలిసిందే. ఈ పాలక మండలి ఏర్పాటైన రెండు రోజుల్లోనే ఇద్దరు ప్రధాన సభ్యుల నేర చరిత్రపై, ఆలయ ఈవో లతపై దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ శయన సోమవారం పల్లికొండేశ్వర ఆలయ కార్యాలంలో పాలకమండలి సభ్యుల నేర చరిత్రపై ఆలయ ఈవోతో చర్చించినట్లు తెలిసింది. అలాగే వీరి నేర చరిత్రకి సంబంధించిన సమగ్ర వివరాలను దేవాదాయశాఖ అధికారులకు ఎందుకు సమర్పించలేదని ఈవోను ప్రశ్నించినట్లు తెలిసింది. వీరి నేర చరిత్రలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను తమతో తీసుకెళ్లినట్లు సమాచారం.

నకిలీ మద్యంపై అసత్య ప్రచారం

పోలీసుల అదుపులో ఇద్దరు వైసీపీ నాయకులు



నవీన్

తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం పేరిట ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంచేసి, ప్రజలను తప్పుదారి పట్టించారంటూ ఇద్దరు వైసీపీ నేతలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తిరుపతి వైసీపీ ఉత్తర విభాగం అధ్యక్షుడు, భూమన అభినయ్ అనుచరుడు నవీన్, అతడి అనుచరుడు వెంకటేష్‌ను అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అభినయ్, వైసీపీ శ్రేణులు అలిపిరి స్టేషన్‌కు వచ్చారు. ఏ కారణంతో.. ఏ కేసు కింద వారిని అదుపులోకి తీసుకున్నారని పోలీసులను భూమన ప్రశ్నించారు. దీంతో కాసేపు అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. డీఎస్పీ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి



సైన్స్‌ల్యాబ్‌కు పరికరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సూళ్లూరుపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం పేర్కొంది. సోమవారం జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, అదనపు గదుల నిర్మాణానికి, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మల్టీపర్పస్ హాలు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. సైన్సు ల్యాబ్‌కు పరికరాలు వితరణ జూనియర్ కళాశాలకు కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ అధ్యక్షుడు సురేష్ రెడ్డి సహకారంలో రూ.75 వేల విలువ చేసే సైన్సు ల్యాబ్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ గౌరవ అధ్యక్షుడు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు అద్దూరు శ్రీనివాసులు, ఎల్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ట్రెజరర్ ధనుంజయ రెడ్డి, సహాయ కార్యదర్శి షేక్ ఉస్మాన్ భాషా, సభ్యులు ఆర్ఎం ఉమామహేశ్వరావు, సాయిరాం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల రామలింగయ్యకాలనీ, జగనన్న లేఅవుట్‌లోని సమస్యలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతానని టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం చెన్నూరులోని రామలింగయ్య కాలనీ, జగనన్న లేఅవుట్‌లను స్థానికులతో కలిసి పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ నాయీ బ్రాహ్మణ కాలనీలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టారు. స్థానిక నాయీబ్రాహ్మణకాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక అధ్వానంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మురుగునీరు నిల్వచేరడంతో బురద మయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సహకారంతో సోమవారం గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ఈ పనులను టీడీపీ నాయకులు పెంచలయ్య, సురేంద్ర, రమేష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, వెంకటకృష్ణయ్య పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

చిట్టమూరు, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు జరిగాయి. ఉదయం గణపతి, లక్ష్మి, అస్త్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. గోపూజ, మంత్రపుష్పం, మంగళ హారతి, విభూది కుంకుమ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం మంగళవాయిద్యం, గణపతి పూజ, పవిత్ర ప్రతిష్ట పూజ, గంధ పవిత్ర సమర్పణ, మంగళహారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు భానుప్రకాష్ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోండి



ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు

నాయుడుపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీదారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, అనిల్‌రెడ్డి, కిషోర్ యాదవ్, హరనాథ్‌రెడ్డి, సిద్ధయ్య, రత్నశ్రీ, అశోక్ పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టండి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాలను అరికట్టాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పత అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్ నుంచి వెంకటగిరి ఎక్సైజ్ కార్యాలయం వైసీపీ మహిళలు ఎక్సైజ్ స్టేషన్ వద్దకు ర్యాలీ నిర్వహించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

పెళ్లకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో పాడిఆవు మృతిచెందింది. పెళ్లకూరు దళితవాడకు చెందిన గంధం గుప్త కుమార్ పశువులను మేత కోసం పొలాల్లో తీసుకెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపుల వర్షంతో పాటు ఆవుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

లోకల్ రైళ్ల రద్దు

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తడ - సూళ్లూరుపేట మధ్య ఇంజనీరింగ్ పనుల కారణంగా లోకల్ రైళ్లు(66035, 66036) 14వ తేదీ మంగళవారం రద్దు చేసినట్లు నాయుడుపేట రైల్వేస్టేషన్ మాస్టర్ చిరంజీవి తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 9441859490, 9492751613 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పంట కాలువల ఆక్రమణ

సాగునీరు అందక రైతుల ఇబ్బందులు

కోట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని ప్రధాన చెరువుల పంటకాలువలు ఆక్రమణకు గురయ్యాయి. మండలంలో 33 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఇందులో సుమారు 8,500 ఎకరాల ఆయకట్టు కలిగిన పెన్నక్కచెరువు పంట కాలువలు నెల్లూరుపల్లి కొత్తపాళెం, చెందోడు, వలిపేడు తదితర గ్రామాల వద్ద ఆక్రమణకు గురయ్యాయి. అదేవిధంగా తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు, కర్లపూడి, చిట్టేడు, రామాపురం, కొండుగుంట, మద్దాలి, ఊనుగుంటపాళెం చెరువుల ఆయకట్టు కింద ఉన్న పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా కాక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంటకాలువ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకపోతే వందలాది ఎకరాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు చెబుతున్నారు.



కొత్తపాళెం వద్ద ఆక్రమణలతో కుచించుకుపోయిన పెన్నక్కచెరువు కాలువ

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహిస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా తాగునీటిని అందించే పైప్‌లైన్ ఆధునీకరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, తహసీల్దారు నరసింహులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, మల్లారం బాబు, చెంగారావు, మేరిగ రామకృష్ణ, జానపాటి బాలకృష్ణ, రామారావు, అనిల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఎండ, తీవ్ర ఉక్కపోత ఉన్నా ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని వర్షం కురడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి.

యూరియా కొరత లేకుండా చర్యలు

వాకాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప తెలిపారు. వాకాడు రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం రైతులకు కార్డులను పంపిణీ చేశారు. ప్రతి రైతు వ్యవసాయశాఖ అందించే కార్డు ద్వారా మాత్రమే యూరియా పొందాల్సి ఉంటుందన్నారు.

అండగుండాల రోడ్డుకు మరమ్మతులు

తడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అండగుండాల రోడ్డుకు మోక్షం లభించింది. అక్కంపేట జాతీయ రహదారి నుంచి అండగుండాల గ్రామం వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల తారురోడ్డు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఆ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉందని, బాగు చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. గ్రావెల్‌తో గుంతలను పూడ్చేందుకు అధికారులు రూ.3 లక్షలు కేటాయించారు. సోమవారం పనులను మొదలుపెట్టారు.

విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు



కొత్త టీచర్లతో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో కొత్తగా 20మంది ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిన విషయం తెలిసిందే. కోట మండలానికి 20మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇందులో ఎస్‌జీటీ నలుగురు, స్కూల్ అసిస్టెంట్‌లు 16 మంది ఉన్నారు. కోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు 5మంది ఉపాధ్యాయులను కేటాయించగా, వారికి హెచ్ఎం భారతి బాధ్యతలు అప్పగించి అభినందించారు.

తడ: మండలంలో కొత్తగా 9మందిని ఉన్న ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ఇందులో ఎస్జీటీలు ముగ్గురు, స్కూల్ అసిస్టెంట్లు 9మంది ఉన్నారు. పల్లిపేటకుప్పం, బీవీపాళెం, ఇరకం, గ్రద్దగుంట, పూడికుప్పం, రామాపురం కుప్పంలో ఒక్కరు చొప్పున నియమితులు కాగా, వాటంబేడు ఉన్నత పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. వీరంతా సోమవారం ఎంఈవో రాములు, మల్లికార్జునరావుకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

జీఎస్టీ సవరణతో తగ్గిన ఆర్థిక భారం

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గిందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. సోమవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం నుంచి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ తరగతులు

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతిపై సర్పంచులకు, ఎంపీటీసీలకు, కార్యదర్శులకు ఎంపీడీవో మధుసూదన్ రావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అమలుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రజలందరికీ సురక్షిత మంచినీటి సరఫరాకు, పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు యామిని, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమిరెడ్డికి సన్మానం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం పట్టణంలోని శిరసనంబేడు మాజీ సర్పంచ్ శిరసనంబేటి సురేష్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు శాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వేలూరు మురళీకృష్ణారెడ్డి, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, గాలి రమేష్ నాయుడు, మైలారి రాజశేఖర్, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వాటర్ ట్యాంకర్ బోల్తా: యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో అదుపుతప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మణి(26) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం ముమ్మాయిపాళెం గ్రామానికి చెందిన మణి వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మేనకూరు సెజ్ సమీపంలో వెళ్తుండగా ట్రాక్టర్‌ను అదుపుతప్పి రోడ్డుపై ఉన్న కంకర్ దిబ్బను ఎక్కడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో...

చిల్లకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు గ్రామంలోని రొయ్యలగుంట వద్ద సోమవారం విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని ఏరూరు అల్లీపురం గ్రామానికి చెందిన వెంకటయ్య (33) గ్రామంలోని వెంకటేశ్వర్లుకు చెందిన రొయ్యలగుంట వద్ద పని చేస్తున్నాడు. సోమవారం గుంటల వద్ద ఇనుపరాడ్డును తొలగిస్తుండగా పైనవున్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎడ్లబండిని ఢీకొన్న మోటారు సైకిల్

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మూర్తిరెడ్డిపాళెం రహదారి సమీపంలో ఎడ్లబండిని మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన కరీముల్లా సోమవారం మోటారు సైకిల్‌పై నాయుడుపేట వస్తుండగా మూర్తిరెడ్డిపాళెం సమీపంలో ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కరీముల్లా తీవ్రంగా గాయపడగా 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

గూడూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందకూరు గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి సిసింద్రి మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ నెల 17వ తేదీన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడుకొండలు, గురవయ్య, సాయినాథ్, కిరణ్, పెంచలయ్య పాల్గొన్నారు.

అంధ క్రీడాకారులకు ప్రోత్సాహకాలివ్వండి



రామ్‌మోహన్ రావుకు వినతిపత్రం ఇస్తున్న నరసయ్య

వెంకటగిరి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంధ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామోహన్ రావును కోరారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కంభంపాటిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టపాసులను నిర్ణీత ధరలకే విక్రయించాలి

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఎస్‌సీఆర్ కల్యాణ మండపంలో దీపావళి పండుగకు 17 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు జయజయరావు తెలిపారు. ఆయా దుకాణదారులు టపాసులను నిర్ణీత ధరలకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాణసంచా దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని తిరుపతి నగరంలో ఏర్పాటు చేసే బాణసంచా విక్రయకేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని డీఆర్వో నరసింహులు సూచించారు. ఈ మేరకు అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. దుకాణాల మధ్య కనీసం మూడుమీటర్ల దూరం ఉండాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షల టపాసుల సీజ్

తిరుచానూరు. అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువైన బాణసంచాను సీజ్ చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి తమిళనాడు నుంచి టపాసులు తెప్పించి నిల్వ ఉంచాడని, స్థానికుల సమాచారం మేరకు సీజ్ చేసి, దామోదర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

శ్మశాన భూమికి మోక్షం కల్పించండి



తహసీల్దారు కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, గిరిజనులు

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన శ్మశాన భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీవాసులు సోమవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. లక్షలాది రూపాయలు విలువ చేసే శ్మశానవాటిక భూమిని కొంతమంది కబ్జా చేశారని, దీంతో శవాలను పూడ్చిపెట్టేందుకు స్థలం దొరక్క ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ గురుకుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గిరిజనులు తరతరాల నుంచి శ్మశానవాటికగా వాడుకుంటూ వచ్చామన్నారు. ఆ భూమిని కొంతమంది కబ్జా చేశారని, దీంతో గిరిజనకాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చుకునేందుకు స్థలం దొరక్క మూడు కిలోమీటర్లు వెళ్లి స్వర్ణముఖినదిలో శవాలను పూడ్చిపెడుతున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, షేక్ జలీల్ అహ్మద్ ద్వారా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పరిస్థితిని తెలుసుకున్నారు. తహసీల్దారుకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన ఆక్రమిత శ్మశానభూమి సర్వే ప్రారంభించారు.

ప్రాథమిక పాఠశాలకు తాగునీటి సౌకర్యం



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

చిట్టమూరు, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యల్లసిరి ప్రాథమిక పాఠశాలలో తాగునీటి బోరును ఎంఈవో బీవీ కృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. కొండేపాటి గంగాప్రసాద్(కేజీపీ) ఫౌండేషన్ నిర్వాహకులు తానంకి నానాజీ పాఠశాలలో రూ.లక్ష వ్యయంతో ఫిల్టర్ పాయింట్ వేసి సింటెక్స్ డ్రమ్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యల్లసిరి మాజీ సర్పంచ్ పోలిన శ్రీనివాస్, హెచ్ఎం సాయికృష్ణ, నాగూరయ్య, వేణుగోపాల్, ప్రసాద్ రెడ్డి, భాస్కర్, మణి, వినయ్‌వతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

తడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శేఖర్‌నాయక్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులు సర్వేల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గ్రద్దగుంట, వేనాడు పంచాయతీ కార్యదర్శులు రావి చైతన్య, నరేష్‌బాబుపై ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎంపీడీవో శేఖర్‌నాయక్ వారి ఇరువురికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సర్కిల్ పరిధిలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా అమ్మకాలు చేస్తే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన చేయాలి



ఉపాధ్యాయుల నుంచి నియామక పత్రాలను స్వీకరిస్తున్న ఎంఈవో మునిరత్నం, మీనాకుమారి

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 మంది కొత్త ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారని ఎంఈవో మునిరత్నం తెలిపారు. నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ధనలక్ష్మి(సైన్స్) శ్రావణి(సోషల్), సుజిత(ఇంగ్లీషు) తమ జాయినింగ్ రిపోర్టులను ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, జీవీ నాయుడు, జి.సుబ్రహ్మణ్యం, డీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం

గూడూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను తుంగలో తొక్కిన ప్రధాని రాష్ట్ర పర్యటనకు రావడం ఎంతవరకు సమంజసమన్నారు. మోదీ పర్యటనను నిరసిస్తూ 15న పట్టణంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శశివకుమార్, నారాయణ, రమేష్, సునీల్, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికలపై అవగాహన సదస్సు

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు మండలస్థాయిలో స్వయం ఆర్థిక ప్రణాళికలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు.

కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ తరగతులు

తడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఎంపీడీవో సమావేశ మందిరంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

ఉమెన్ టి20 క్రికెట్ జట్టులో జిల్లా క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టి20 క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మ సైనిరెడ్డి(వైస్ కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్బుమ్ సత్తాచాటారు. వీరిని జట్టుకు ఎంపిక చేశారు.

అటెండర్ వర్సెస్ డాక్యుమెంట్ రైటర్లు

● అరుపులు, కేకలతో దద్దరిల్లిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రేణిగుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్, డాక్యుమెంట్ రైటర్ల నడుమ తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఓ డాక్యుమెంట్ రైటర్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తి ద్వారా కార్యాలయ సిబ్బందికి మూమూళ్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడాన్ని గుర్తించిన అటెండర్ తిరుమలేశు అందుకు అడ్డుపడ్డాడు. దీంతో అటెండర్, డాక్యుమెంట్ రైటర్ రూపేష్ నడుమ తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. మిగిలిన రైటర్లు రూపేష్‌కు మద్దతుగా కార్యాలయంలోకి రావడంతో అరుపులు, కేకలతో దద్దరిలింది.



అటెండర్, డాక్యుమెంట్ రైటర్ నడుమ వాగ్వాదం

అనంతరం అటెండర్‌పై చర్యలు తీసుకోవాలంటూ డాక్యుమెంటు రైటర్లు సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఎట్టకేలకు స్పీడ్ బ్రేకర్లకు రంగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేణిగుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట - తిరుపతి మార్గంలో స్పీడ్ బ్రేకర్లకు ఎట్టకేలకు రంగులు వేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేసే పనులను ఆదివారం రాత్రి నుంచి ప్రారంభించి పూర్తి చేశారు.



● వివాదాస్పద భూముల్లో నిర్మాణాలకు సోమవారం రేణిగుంట తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఆ నిర్మాణాలను అడ్డుకున్న వీఆర్వో రమేష్‌పై దౌర్జన్యం చేయడాన్ని ఖండించారు. ఆ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసిన ఆయన తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే సమాచారంపై విచారణ చేపట్టారు. దీంతో ఆక్రమణదారుల్లో గుబులు పట్టుకుంది.

శ్రీసిటీలో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

సత్యవేడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణానికి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, కస్టమర్ రిలేషన్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్ హాజరయ్యారు. మొదటి దశలో రూ.75లక్షలతో పది పడకల ఆస్పత్రిగా నిర్మిస్తున్నారు. ప్రత్యేక అవుట్ పేషెంట్ సేవలతో వచ్చే ఉగాది నాటికి ఆస్పత్రి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని శివప్రసాద్ తెలిపారు. ఈ ఆస్పత్రిలో పంచకర్మ, ప్రసూతి తంత్ర (ప్రసూతి, స్త్రీ సంబంధిత వ్యాధులు), కాయచికిత్స (సాధారణ వైద్యం)వంటి ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి డయాగ్నస్టిక్ ల్యాబ్, పంచకర్మ, క్షార సూత్ర చికిత్స, యోగా, వెల్‌నెస్, సంతానోత్పత్తి, రుమటాలజీ, చర్మ, సౌందర్య చికిత్సా విభాగాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ, ఆయుర్వేద వైద్య విధానాలను సమన్వయం చేస్తూ శ్రీతులసి ఆస్పత్రి శ్రీసిటీలో సమగ్ర ఆరోగ్య కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



భూమి పూజలో డాక్టర్ శివప్రసాద్ తదితరులు

పెట్టుబడుల సురక్షిత ప్రాంతంగా రాష్ట్రం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్ర జ్యోతి): పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సురక్షితమని పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. సోమవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో మంత్రి లోకేశ్ పట్టుదలతో గూగుల్ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టనుందన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్ పేరుతో పది బిలియన్ డాలర్లతో గూగుల్ 1గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌కు సంబంధించి మంగళవారం ఢిల్లీలో సీఎం సంతకాలు చేయనున్నారన్నారు. దీంతో రాష్ట్ర కీర్తి పతాకం ప్రపంచ దేశాల్లో రెపరెపలాడనుందన్నారు. రాష్ట్రాన్ని స్నేహపూర్వక పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దడంతో విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు వస్తున్నాయన్నారు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్ బి.భాస్కర్ ముదిరాజ్, నాయకులు వజ్రం కిషోర్, డీవీ నారాయణ, కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కార్మిక వ్యతిరేక చట్టాలపై ఉద్యమిద్దాం: సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్

పుత్తూరు టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై ఉద్యమిద్దామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వీఎస్ఎస్ కల్యాణ మండపంలో సీఐటీయూ సభలను యూనియన్ సీనియర్ నాయకుడు సుబ్రమణ్యంపిళ్లై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నర్సింగరావు మాట్లాడుతూ... కార్మికుల హక్కులను కుదించి, సంక్షేమ పథకాలను దశలవారీగా రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వాలు కార్మికుల శ్రేయస్సును పక్కన పెట్టి కార్పొరేట్ అనుకూల విధానాలను తీసుకువస్తున్నాయని ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ మండిపడ్డారు. అన్ని రంగాల కార్మికులను ఒకే వేదికపై తీసుకుని వచ్చి రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, నాయకులు నాగరాజు, అంగేరి పుల్లయ్య, సుబ్రమణ్యం, జి.వెంకటేష్, వెంకటేష్ సహా సీఐటీయూ అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అంజేరమ్మ కనుమ వద్ద నగరవనం ఏర్పాటు

వడమాలపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారి వడమాలపేటకు సమీపంలోని అంజేరమ్మ కనుమ వద్ద నగర వనం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంజేరమ్మ కనుమ పరిసరాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వివిధ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో భాగంగా నగర వన యోజన పథకం కింద కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో కోటి రూపాయలతో రాష్ట్ర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగర వనం ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఎస్.వి.పురం రెవెన్యూ పరిధిలో అంజేరమ్మ కనుమ భూముల్లో రూ.150 కోట్లతో రిసార్ట్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇక్కడ భూములకు సంబంధించి 120 ఎకరాలను తుడా సేకరించనుంది. పచ్చదనం, అటవీసంరక్షణ నేపథ్యంలో ప్రజలకు, స్వచ్ఛమైన గాలి, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కేంద్రప్రభుత్వం చేపడుతోంది.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):స్థానిక భవానీ శంకర ఆలయంలో మహాశివుడి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం సదాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశివుడి లింగాన్ని పూలమాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.



శ్రీకాళహస్తి

సత్యవేడు

వైద్యుల సమ్మెకు సిబ్బంది మద్దతు

కేవీబీపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు గత నెల 28వ తేదీ నుంచి తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం కేవీబీపురం పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది వైద్యులకు మద్దతుగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ముందు నిరసన తెలిపారు.

విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

కేవీబీపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఆరుగురు నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ తెలిపారు. కోవనూరు, వడ్డికండ్రిగ, కున్నం, కళత్తూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలు చేరగా, ఆరె, అంజూరు, కేవీబీపురం మండల కేంద్రంలో ఉన్నతపాఠశాలలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరారన్నారు. వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ఎంపికైన 32 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారులు మండలానికి 32 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. వీరిలో 10 మంది స్కూల్ అసిస్టెంట్లు కాగా 22 మంది ఎస్జీటీలు ఉన్నారు.





కేవీబీపురం ఎంఈవో నుంచి స్వీట్‌బాక్సులు అందుకుంటున్న కొత్తగా విధుల్లో చేరిన టీచర్లు- సత్యవేడులో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో రవి

ఇటీవల వీరు శిక్షణ పూర్తి చేసుకుని నియామక పత్రాలతో ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో రవికి రిపోర్ట్ చేసుకున్నారు. నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాలను పరిశీలించిన ఎంఈవో వారికి విధులను కేటాయంచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎంఈవో నూతన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ.. సమాజాన్ని సరైన దిశలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అంకితభావంతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తుకు, సమాజ వికాసానికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఎంఈవో రవి, యూటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలిపి, స్వీట్లు పంచిపెట్టారు.

హెచ్‌వోడీ భవన ప్రారంభోత్సవంలో చందన స్రవంతి



ప్రారంభోత్సవంలో సీఎంతో చందన స్రవంతి

సత్యవేడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించిన హెచ్‌వోడీ భవనం ప్రారంభోత్సవంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్‌డీసీ) డైరెక్టర్ డాక్టర్ చందన స్రవంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన స్రవంతి మాట్లాడుతూ అమరావతిలో సీఆర్‌డీఏ, ఏపీయూఎఫ్ఐడీసీ కొత్త కార్యాలయాల భవనాలను నిర్మించడం రాష్ట్రాభివృద్ధి దిశగా చరిత్రాత్మక అడుగు పడిందన్నారు. పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో ఆధునిక మార్పులకు ఇది దోహద పడుతుందని ఆమె తెలిపారు.

వీకేఆర్‌పై కాలనీలో ఆగని ఆక్రమణ పర్వం



ఆక్రమణకు గురైన స్థలం

వరదయ్యపాళెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై గిరిజన కాలనీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల వీకేఆర్‌పై కాలనీ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. అయితే తహసీల్దార్‌కు అందిన ఫిర్యాదు మేరకు పనులను నిలుపుదల చేసి రెవెన్యూ సిబ్బంది ద్వారా బోర్డు నాటించారు. తాజాగా కాలనీ కూడలి నుంచి హీరో పరిశ్రమకు వెళ్లే మార్గంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రాత్రికి రాత్రి దర్జాగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈ తంతు గత రెండు రోజులుగా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీకేఆర్‌పై కాలనీలో ప్రభుత్వ భూములను రక్షించేందుకు ఇద్దరు సిబ్బందిని నియమించినా కూడా ఆక్రమణల పర్వం కొనసాగుతుండడంపై అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించాల్సి ఉంది.

కల్తీ మద్యాన్ని అరికట్టండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని అరికట్టాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం వైసీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కల్తీ మద్యం తాగి ఇప్పటికే ఎంతోమంది అమాయకులు చనిపోయారన్నారు. తూతూమంత్రంగా కమిటీలు వేసి నిందితులను కాపాడే యత్నం చేస్తే వైసీపీ ఊరుకోదన్నారు. ఓ.గిరిధర్‌రెడ్డి, వాసుదేవనాయుడు, సంధ్యారాణి, వి.కృష్ణారెడ్డి, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కోగిలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు యూరియా కొరతను నివారించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోర్‌రెడ్డి కోరారు. సోమవారం శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్‌రెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు సకాలంలో యూరియా అందక పక్క తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు నుంచి అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆంటోని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి హామీ ఏపీవో, ఏఎంసీ కార్యదర్శి తమ కార్యాలయాల్లో విధులకు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అధికారుల కోసం వచ్చిన ప్రజలు మధ్యాహ్నం వరకు నిరీక్షించి వెనుదిరిగారు. తహసీల్దార్ కార్యాలయంలో అయితే వీఆర్వోలు కూడా పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. గత సోమవారం కూడా పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. జిల్లా అధికారులు స్పందించి పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరు అయ్యే విధంగా చూడాల్సి ఉందని మండలవాసులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ఎంపీడీవో కుర్చీ

ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

పిచ్చాటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం పుత్తూరు నుంచి పిచ్చాటూరు మీదుగా సత్యవేడు వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. సత్యవేడు డిపో డీఎం వెంకటరమణతో కలిసి బస్సు ఎక్కి మొదటి టిక్కెట్టు ఎమ్మెల్యే తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ... ఉదయం సాధారణంగా నడిచే ఈ సర్వీసు ప్రతి రోజు సాయంత్రం 3.15 గంటలకు పుత్తూరు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. ఇటీవల ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువ కావడంతో విద్యార్థులు సకాలంలో ఇళ్లకు చేరలేకపోతున్నారన్నారు. దీనిపై ఆర్ఎంతో చర్చించి ప్రత్యేక సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, శంకరాపురం ఆయకట్టు చైర్మన్ పద్దురాజు, నాయకులు డిల్లీ, వాసురెడ్డి, సుమాంజలి, వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ సురక్షితం

నారాయణవనం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం సురక్షతంగా ఉంటుందని మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు షేక్ రుఖియాబేగం అన్నారు. సోమవారం నారాయణవనం వెలుగు కార్యాలయంలో సీడీపీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో 8వ పోషకాహర మాసోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రుఖియా బేగం బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. మహిళలకు, బాలికలను ఎటువంటి ఇబ్బంది ఎదురైనా ఆదుకుంటామని చెప్పారు. ఎంపీడీవో అరుణ, ఎంఈవో కోదండనాయుడు,హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి, సుమతి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రుఖియాబేగం

● అప్పుడు... ఇప్పుడు

మట్టితోలి పాఠశాల ఆవరణ చదును



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లేటివారికండ్రిగ పంచాయతీ కృష్ణాపురం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణాన్ని సర్పంచ్ యనమల కోటమ్మ మట్టితోలి చదును చేయించారు. పాఠశాల ఆవరణ లోతట్టుగా ఉండటంతో వర్షం వస్తే నీళ్లు నిలిచి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడేవారు. పరిస్థితి సర్పంచ్ దృష్టికి వెళ్లడంతో పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి మట్టితోలి ఎత్తు పెంచారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



పాఠశాల ఆవరణాన్ని చదును చేస్తున్న కూలీ

యూరియా కొరతలేదు

వరదయ్యపాళెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం, ఫెర్టిలైజర్ ఏడీఏ ధనుంజయరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నందకిశోర్ రెడ్డితో కలిసి సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు యూరియా విక్రయ దుకాణాలు, ఏజెన్సీలతో మాట్లాడి యూరియా స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కార్డులను పంపిణీ చేసి, యూరియాను అందజేయాలని ఏవో గౌరిని ఆదేశించారు.



యూరియా దుకాణాన్ని పరిశీలిస్తున్న ప్రసాదరావు తదితరులు

నిత్యాన్నదానానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన విజయకుమార్ దంపతులు తమ కుమార్తె బ్రాహ్మణి వి గౌడ పేరు మీద రూ.లక్ష, నెల్లూరుకు చెందిన సాహితి రూ.55,555, నరసారావుపేటకు చెందిన పొన్నపాటి ఈశ్వరరెడ్డి రూ.11,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గుండె కొట్టుకోవడం ఆగిపోయినపుడు, మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు సరిగా రక్తప్రసరణ జరగనపుడు మనిషి చనిపోయే ప్రమాదం ఉన్నపుడు సీపీఆర్ చేయడం వల్ల ప్రాణం కాపాడే అవకాశం ఉంటుందని ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్, గుడ్లూరు మయూర్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంజీఎం ఆస్పత్రి సహకారంతో సీపీఆర్‌పై ఎంజీఎం విద్యాసంస్థల ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో యువనేష్ ప్రతిభ



శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామరావువీధి ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి యువనేష్ అబాకాస్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. చెన్నైలో ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొన్నాడు. సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రశంసాపత్రం అందజేసి యువనేష్‌ను అభినందించారు.

సంపంగి సాగుతో అధిక లాభాలు

రేణిగుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంపంగి సాగుతో లాభాలు వస్తామని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సంపంగి క్షేత్ర పర్యటనలో భాగంగా కరకంబాడి సమీపంలోని ఓ రైతు పొలంలో పండిస్తున్న సంపంగి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ్వల్ రకాన్ని సమగ్ర పోషక యాజమాన్య, సస్యరక్షణ పద్ధతుల ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చని చెప్పారు. సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రాంకుమార్, పుష్పలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.